క్లుప్తంగా

నేటి నుంచి గజ్జెపూజ మహోత్సవం

లింగాల : మండలంలోని చిన్నకుడాల గ్రామంలో శని, ఆదివారాలలో గజ్జెపూజ మహోత్సవం గ్రామస్తులు, యువకుల సహాయ సహకారాలతో నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. శనివారం ఉదయం గజ్జెల పూజ, కలశ పూజ జరుగుతుందని, శనివారం రాత్రి కోలాట ప్రదర్శన ఉంటుందన్నారు. అలాగే ఆదివారం మహా మంగళ హారతితోపాటు రామాయణ, మహాభారతం జానపద పాటలతో కోలాట ప్రదర్శన ఉంటుందన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

జమ్మలమడుగు : జమ్మలమడుగు, మైలవరం పారిశ్రామిక శిక్షణ సంస్థలో ఆసక్తి ఉన్న పదవ తరగతి ఉత్తీర్ణత, ఫెయిల్ అయిన విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కాలేజి ప్రిన్సిపాల్ వనరూప్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు పదవ తరగతి మార్కుల జాబిత, టీసీ, కుల ధృవీకరణ పత్రం, ఆధార్‌కార్డు, పాస్‌పోర్టుసైజ ఫొటోలతో ప్రభుత్వ ఐటీఐలో సంప్రదించాలన్నారు. లేదా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చు అని తెలిపారు. విద్యార్థులు జూలై 15వ తేదీలోపు దరఖాస్తులు చేసుకుంటే జూలై 21వ తేదీ కౌన్సెలింగ్ నిర్వహిస్తారన్నారు. పూర్తి వివరాలకు ఐటీఐలో సంప్రదించాలని సూచించారు.

ఉపాధ్యాయుల సేవలు ఎనలేనివి



బదిలీ అయిన ఉపాధ్యాయులను సన్మానిస్తున్న హెడ్మాస్టర్, ఉపాధ్యాయులు

లింగాల : ఉపాధ్యాయుల సేవలు ఎనలేనివి అని పాఠశాల హెడ్మాస్టర్ ప్రసాద్ తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఇటీవల బదిలీ అయిన నలుగురు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను సహ ఉపాధ్యాయులు, విద్యార్థులు, శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను అందించి సత్కరించారు. అనంతరం అత్యంత ప్రతిభ చూపిన శశిధర్, యశ్వంత్‌రెడ్డి అనే విద్యార్థులకు పీఈటీ రమేష్‌రెడ్డి, టీచర్ జయలలిత దంపతులు రూ.5వేల చొప్పున నగదు బహుమతులను అందించారు. అనంతరం విద్యార్థులకు విందు భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల పాత్ర కీలకం

జమ్మలమడుగు రూరల్ : గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శుల పాత్ర కీలకమని ఎంపీడీఓ సయ్యద్ ఉన్నిసా తెలిపారు. శుక్రవారం పంచాయతీ కార్యదర్శులుగా విధులు నిర్వహిస్తున్న నారాయణరెడ్డి, శ్రీనివాసులు బదిలీ సందర్భంగా వీడ్కోలు సమావేశం నిర్వహించారు.


ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సాయిసుధ

వేంపల్లె : స్థానిక శ్రీవాసవీ కల్యాణ మండపంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని ఆవోపా అధ్యక్షుడు బైరిశెట్టి వెంకటసునీల్‌కుమార్, మహిళా విభాగ అధ్యక్షురాలు పచ్చిపులుసు ప్రవీణలు తెలిపారు. శుక్రవారం ఆవోపా, ఆవోపా మహిళా విభాగ్, కడపకు చెందిన సుధా టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత సంతాన సాఫల్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ వైద్య శిబిరంలో దాదాపు 53 మందికి గైనిక్ సమస్యలకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి వారికి మందులు ఉచితంగా పంపిణీ చేశారన్నారు. రాబోయే కాలంలో మరిన్ని సేవలు అందించేందుకు కృషి చేస్తామని సభ్యులు వెల్లడించారు. కార్యక్రమంలో ఆవోపా కార్యవర్గం, ఆవోపా మహిళా విభాగ్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పరామర్శ



గంగిరెడ్డిని పరామర్శిస్తున్న జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి

వీరపునాయునిపల్లె : మండలంలోని ఉరుటూరు గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు గంగిరెడ్డి ఆయన సతీమని శుక్రవారం ఉదయం జరిగిన ప్రమాదంలో గాయపడ్డారు. విషయం తెలుసుకున్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి ప్రొద్దుటూరులోని ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. మండల ఉపాధ్యక్షుడు శేఖర్‌రెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, తదితరులు ఆయన వెంట ఉన్నారు.

కొందరికి మోదం.. మరి కొందరికి ఖేదం

- తల్లికి వందనం మండలంలో అర్హులు 4126
- లబ్ధి చేకూరింది 3481 మందికి
- 645 మందికి కొర్రి

చక్రాయపేట : సూపర్ సిక్స్‌లో భాగంగా కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన తల్లికి వందనం పథకం కొందరికి ఆనందాన్ని ఇస్తే మరి కొందరికి కన్నీటిని మిగిల్చింది. నిరుపేదలై ఉండి పథకానికి అర్హులైనా కూడా వంద లాది మందికి డబ్బులు పడక కన్నీటిని రాలుస్తూ చివాలయాల వద్దకు పరుగులు తీస్తున్నారు. అక్కడ వారికి వచ్చే సమాధానం 10 ఎకరాల పైనే మీ పేరిటి భూమి ఉంది అందుకే మీకు తల్లికి వందనం పడలేదంటున్నారు. మండలంలో 16 గ్రామ పంచాయతీలు 11 సచివాలయాల పరిధిలో ఉన్నాయి. ఇందులో సుమారు ఐదెకరాల లోపు భూమి ఉన్న వారే. దీంతో వారు రెవెన్యూ సిబ్బందిని నిలదీస్తున్నారు. దీంతో రెవెన్యూ సిబ్బంది తమ రికార్డులను పరిశీలించి ఎల్‌పీఎం నెంబర్ల కారణంగా జాయింట్ నంబర్లు వచ్చి మీ పేరిట భూమి ఎక్కువ చూపుతోందని సమాధానం ఇస్తున్నారు. దీంతో కొందరైతే మాకు తల్లికి వందనం లేకున్నా పరవాలేదు మాపేరిట చూపుతున్న భూమి ఎక్కడుందో చూపించాలంటున్నారు. మహాదేవపల్లె గ్రామం బొజ్జావాండ్లపల్లెకు చెందిన కాణాల రామకృష్ణమ్మకు ఖాతా నంబరు 437లో కేవలం 3.22 ఎకరాల భూమి మాత్రమే ఉంది. అయితే ఈమెకు ఇదే ఖాతా నంబరులో 541,621,653,679 ఎల్‌పీఎం నంబర్ల కింద సుమారు 23 ఎకరాల వరకు భూమి చూపుతోంది. దీంతో ఆమెకు తల్లికి వందనం డబ్బు జమ కాలేదు. మహాదేవపల్లెకు చెందిన యక్కలూరి ఖాసీంకు కేవలం రెండున్నర ఎకరాల భూమి మాత్రమే ఉంది ఇతని పేరిట సుమారు 11 ఎకరాలు పైనే భూమి ఉన్నట్లు రెవెన్యూ రికార్డులు చూపుతున్నాయి. మండలంలో వివిధ కారణాలవలన సుమారు 645 మందికి తల్లికి వందనం పడలేదు.

సచివాలయం పేరు	లబ్ధిదారుల సంఖ్య	లబ్ధి పొందిన వారి సంఖ్య	అనర్హులుగా ప్రకటించినవారి సంఖ్య
కల్లూరుపల్లె	342	302	40
చక్రాయపేట	480	408	72
కుమార్లకాల్వ	459	384	75
చిలేకాంపల్లె	436	387	49
సురభి 2	411	353	58
సురభి 1	380	343	37
కుప్పం	430	386	44
మారెళ్లమడక	297	242	55
మహదేవపల్లె	311	245	66
నెరుసుపల్లె	307	210	97
కె.ఎర్రగుడి	273	221	52
మొత్తం	4126	3481	645

అంత భూమి ఉంటే నా భర్త గల్ఫ్‌కు ఎందుకు వెళతాడు



నాకు ముగ్గురు పిల్లలు. నా భర్త విజయగంగిరెడ్డి కువైట్‌కు వెళ్లాడు. మాకు మూడెకరాల చిల్లర భూమి ఉంటే 20 ఎకరాల పైన ఉందని చెబుతున్నారు. అంత భూమి ఉంటే నన్ను బిడ్డలను విడిచి నాభర్త కువైట్‌కు ఎందుకు వెళతాడు. హాయిగా ఇంటి వద్దనే ఉండి పంటలు పెట్టుకుని పిల్లలను చదివించు కుంటాం కదా. తల్లికి వందనం ముగ్గురు బిడ్డలకు వస్తుందని చెప్పి ఇప్పుడు భూమి ఎక్కువ ఉందని ఎగ్గొట్టారు.

– కాణాల రామకృష్ణమ్మ, బొజ్జావాండ్లపల్లె

ఎగనామం పెట్టడానికే లేని పోని నిబంధనలు



తల్లికి వందనంలో కొందరికైనా ఎగనామం పెట్టడానికే లేని పోని నిబంధనలు పెట్టారు. మండలంలో 645 మందికి డబ్బు పడలేదు. ఏమంటే కారణాలు ఏవేవో చెప్పి తప్పించుకోవాలనే ఈఎత్తుగడ. వెంటనే ప్రభుత్వం స్పందించి నిబంధనలను సవరించి అందరికీ తల్లికి వందనం అందించాలి. గత సంవత్సరం నుంచి ఊరించి ఇప్పుడు ఇలా చేయడం కూటమి ప్రభుత్వానికి భావ్యం కాదు.

– తాటిగొట్ల శివప్రసాదరెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు

రెడ్లపై అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదు

పులివెందుల టౌన్ : రెడ్లపై అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని ఆర్‌సీడీఎస్ అధ్యక్షుడు సురేంద్రారెడ్డి, ఉపాధ్యక్షుడు సర్వోత్తమరెడ్డిలు తాతంశెట్టి నాగేంద్రకు సూచించారు. శుక్రవారం పులివెందులలో వారు విలేకరులతో మాట్లాడుతూ తాతంశెట్టి నాగేంద్ర మాట్లాడిన భాష మీరు తిడుతున్న తిట్లు మీరు మీ కుటుంబ సభ్యులకైనా వినిపించ గలరా. వినిపించిన తర్వాత కుటుంబ సభ్యుల దగ్గర మీ పరిస్థితి ఎలా ఉంటుందో ఆలోచించుకోవాలన్నారు. మీరు ఏ కమ్యూనిటీ అయినా ఉండొచ్చని, మేము మీలాగా మీ వ్యక్తిగతాన్ని మీ కమ్యూనిటీకి మీద రుద్దమన్నారు. మేము ఇతర కమ్యూనిటీని గౌరవించుకుంటూ ఎవరిని కించపరచుకుండా అందరినీ కలుపుకుంటూ సహాయ సహకారాలు చేస్తూ మా గౌరవాన్ని పెంచుకుంటున్నామన్నారు. మీ నాయకులు పవన్ కళ్యాణ్ మిమ్మల్ని ఈ విధంగా మాట్లాడమని ఆదేశించారా అని ప్రశ్నించారు. జనసేనలో రెడ్డి కమ్యూనిటీ మొత్తం ఈ విషయం మీద తీవ్రంగా ఖండించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్‌సీడీఎస్ సభ్యులు రఘునాథ్‌రెడ్డి, వెంగళరెడ్డిలు పాల్గొన్నారు.

రేపు ప్రముఖ వైద్య నిపుణుల రాక

– ఉచిత షుగర్ పరీక్షలు

పులివెందుల : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. కర్నూలు విశ్వభారతి ఆసుపత్రి నుంచి ప్రముఖ గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ హితేష్‌రెడ్డి గుండె సంబంధిత జబ్బులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ప్రముఖ షుగర్ స్పెషలిస్ట్ డాక్టర్ వై.జి.హర్షవర్ధన్‌రెడ్డి ఉచితంగా షుగర్ పరీక్షలు నిర్వహించి సలహాలు, సూచనలు ఇస్తారన్నారు. షుగర్ పరీక్ష చేయించుకోవాలనుకునేవారు పడగడుపున ఏమి తినకుండా రావాలన్నారు. అలాగే ఆసుపత్రిలో నూతనంగా డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభించడం జరిగిందని, కిడ్నీ సేవలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాయన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 08568 286189, 9963170177 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కమలాపురం : స్థానిక బాలయోగి గురుకుల పాఠశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి 6 నుంచి 9వ తరగతి వరకు మిగిలి ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జి.తులశమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మిగిలి ఉన్న సీట్లను ప్రవేశ పరీక్ష ద్వారా భర్తీ చేస్తామని ఆమె తెలిపారు. ఈనెల 23వ తేదీ వరకు దరఖాస్తులు సమర్పించాలని, ఇతర సమాచారం కొరకు సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో సంప్రదించాలని ఆమె తెలిపారు. ప్రవేశ పరీక్ష బాలికలకు చిన్న చౌక్ గురుకుల పాఠశాల నందు, బాలురకు రామాపురం గురుకులంలో ఈనెల 25వ తేదీన ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

ఐటీఐ సీట్లకు దరఖాస్తు చేసుకోవాలి

వేంపల్లె : స్థానిక కందుల ఓబుళరెడ్డి ఐటీఐ కళాశాలలో మిగిలి ఉన్న సీట్లకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఐటీఐ ప్రిన్సిపాల్ ప్రసాదరావు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. వేంపల్లె ఐటీఐలో ఫిట్టర్, సివిల్, వెల్డర్, డీజిల్ మెకానిక్, ప్లంబర్ కోర్సులు ఉన్నాయని, ప్లంబర్ కోర్సులో చేరడానికి 8వ తరగతి చదివి ఉండాలని, మిగిలిన కోర్సులకు వాటికి 10వ తరగతి పాసై ఉండాలన్నారు. రెండవ విడత అడ్మిషన్లకు ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చిందని, ఐటీఐలో సీట్లు కావాలనే విద్యార్థులు జులై 14వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. జులై 23న ఇంటర్వ్యూలు వేంపల్లె ఐటీఐలో ఉంటాయన్నారు.

తొండూరులో..

తొండూరు : స్థానిక ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ)లో 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి రెండవ విడతలో మిగిలిన సీట్ల కోసం దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి తెలిపారు. పదవ తరగతి పాసైన విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని, జులై 21వ తేదీన కౌన్సిలింగ్ ఉంటందన్నారు. మరిన్ని వివరాలకు ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో సంప్రదించాలన్నారు.

సేవాగుణం అనేది ప్రతి ఒక్కరిలో రావాలి

వేంపల్లె : సేవా గుణం అనేది ప్రతి ఒక్కరిలో రావాలని ఎంఈఓ వెంకటరామిరెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక ఎస్‌ఎస్‌ఆర్ కల్యాణ మండపంలో రిటైర్డ్ ఉపాధ్యాయుడు నరసింహారెడ్డి తన తల్లి సింగారెడ్డి సుబ్బమ్మ మొదటి వర్ధంతి సందర్భంగా పేదలకు, దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈఓ చేతులమీదుగా 500 మంది పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. తల్లిదండ్రులు పేరుతో అనాథ వృద్ధులకు ఆదుకొనేందుకు ఇలాంటి కార్యక్రమాలు పెట్టడం శుభ పరిణామమన్నారు. అనంతరం పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఇఓ -2 స్టాలిన్ ఐజాక్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియా పట్ల బాలికలు అప్రమత్తంగా ఉండాలి

జమ్మలమడుగు : విద్యార్థులు షోషల్ మీడియా పట్ల అప్రమత్తంగా ఉండటంతోపాటు విలువలతో కూడిన చదువులు ఎంతో అవసరమని డీఎస్పీ వేంకటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం స్థానిక కస్తూర్బా గాంధీ పాఠశాలలో విద్యార్థులకు డ్రగ్స్, ఈవ్‌టీజింగ్ వంటి అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలు, బాలుర ఉన్నతంగా చదువుకోవాలనే ఆలోచన తప్ప ఎటువంటి ఆలోచనలు పెట్టుకోకూడదన్నారు. తల్లిదండ్రుల కష్టాన్ని వృథా చేయకూడదన్నారు. డ్రగ్స్, మత్తు మందు వంటి వాటికి అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దు అని సూచించారు. బాలికలు ఎటువంటి సమస్యలు వచ్చినా 100, 112 నంబర్‌లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. షోషల్ మీడియాలో ఆడపిల్లలు, మహిళలను ట్రాప్ చేస్తున్నారని అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సీఐ లింగప్ప, ఎస్ఐ హైమావతి, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ



నిరుపేదలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్న ఎస్‌బీఐ బ్యాంకు ఉద్యోగులు

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్టేట్ బ్యాంక్(మెయిన్)లో శుక్రవారం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ యూనియన్ అమరావతి సర్కిల్ వ్యవస్థాపకులు కామ్రేడ్ తారక్‌నాథ్ 21వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్‌బీఐ బ్యాంకు ఉద్యోగులు, స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షుడు రాజుల చేతులమీదుగా నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తారక్‌నాథ్ బ్యాంక్ ఉద్యోగులకు, వినియోగదారులకు ఆయన అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది, ఎస్‌ఏహెచ్‌ఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ శాఖలో పనిచేయడం గర్వకారణం

ఘనంగా రెవెన్యూ డే వేడుకలు

చక్రాయపేట : రెవెన్యూ శాఖలో పనిచేయడం ఎంతో గర్వకారణమని తహసీల్దారు విజయకుమారి తెలిపారు. రెవెన్యూ దినోత్సవం సందర్భంగా స్థానిక కార్యాలయంలో రెవెన్యూ రికార్డుల ప్రదర్శన నిర్వహించి పలువురు ఉద్యోగ విరమణ పొందిన రెవెన్యూ ఉద్యోగులను సత్కరించారు. అనంతరం చక్రాయపేటలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు



చక్రాయపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉద్యోగులు



లింగాలలో మొక్కలు నాటుతున్న రెవెన్యూ సిబ్బంది

పులివెందులలో..

పులివెందుల టౌన్ : రెవెన్యూ శాఖ ప్రజలు, రైతులతో నిరంతరం మమేకమవుతూ ఎన్నో సేవా కార్యక్రమాలను ప్రత్యక్షంగా, పరోక్షంగా సేవలు అందిస్తోందని తహసీల్దార్ మహమ్మద్ నజీర్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ దినోత్సవం సందర్భంగా రెవెన్యూ అధికారులు, సిబ్బందికి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ శాఖ ప్రతి శాఖతో సమన్వయం చేసుకుంటూ తలలో నాలుకలాగా మెలుగుతోందన్నారు. అనంతరం ఉత్తమ సేవలు అందించిన రెవెన్యూ ఉద్యోగులను సన్మానించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

లింగాలలో..

లింగాల : తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం రెవెన్యూ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో తహసీల్దార్ ఈశ్వరయ్య మాట్లాడుతూ జూన్ 20వ తేదీన రెవెన్యూ డేని పండుగ రోజులా నిర్వహించడం జరిగిందన్నారు. 18 ఏళ్లు వీఆర్‌ఓగా పనిచేసి పదవీ విరమణ పొందిన మహేశ్వరరెడ్డిని సత్కరించారు. ఆర్ఐ గంగాధరరెడ్డి మాట్లాడుతూ రెవెన్యూ డేని ప్రభుత్వం నిర్ణయించడం హర్షించదగ్గ విషయమన్నారు. అనంతరం కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటి నీరు పోశారు. కార్యక్రమంలో ఆర్ఐ నరేంద్ర, సర్వేయర్ పార్వతి, గ్రామ సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



పులివెందులలో మాట్లాడుతున్న తహసీల్దార్ మహమ్మద్ నజీర్



జమ్మలమడుగులో రెవెన్యూ దినోత్సవంలో మాట్లాడుతున్న ఆర్డీఓ

జమ్మలమడుగులో

జమ్మలమడుగు : రెవెన్యూలో ప్రజల సమస్యలను పరిష్కరించినప్పుడే ఉద్యోగులకు గుర్తింపు వస్తుందని ఆర్డీఓ సాయిశ్రీ తెలిపారు. శుక్రవారం రెవెన్యూ దినోత్సవంలో భాగంగా సభాభవనంలో నియోజకవర్గంలోని రెవెన్యూ అధికారులతో పాటు సిబ్బందితో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటికే రెవెన్యూపై అనేక ఆరోపణలు వస్తున్నాయి. ప్రతి ఒక్కరం జాగ్రత్తగా పనిచేసి వాటని తొలగించే ప్రయత్నం చేద్దామని సూచించారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరచిన రెవెన్యూ ఉద్యోగులకు సన్మానం తోపాటు ప్రశంసాపత్రాలను అందించారు. కార్యక్రమంలో కార్యాలయ ఏఓ ఇక్బాల్‌బాషా, తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవ పథకం వర్తింపజేయాలి

జమ్మలమడుగు : అన్నదాత సుఖీభవ పథకాన్ని కౌలు రైతులకు వర్తింపజేయాలని ఏపీ రైతు సంఘం నాయకుడు ఎం.వి.సుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఎర్రగుంట్లలోని రైతు సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కూటమి ప్రభుత్వం కౌలు రైతులపై ఏమాత్రం దయ చూపడంలేదన్నారు.

సన్నచిన్నకారు రైతులతోపాటు డీకేటీ రైతులకు, కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పథకం వర్తింపజేయాలని ఈనెల 23వ తేదీన జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకుడు చిన్నప్పరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతోనే అదిక దిగుబడులు

చక్రాయపేట : ప్రకృతి వ్యవసాయంతో రైతులు అదిక దిగుబడులు ససాధించవచ్చని కేవీకే సస్యరక్షణ శాస్త్రవేత్త శిల్పకళ సూచించారు. ప్రకృతి వ్యవసాయంలో భగంగా రెండు రోజులపాటు మండలంలోని నెరుసుపల్లెలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులు అదనపు ఆదాయం మరియు ఆరోగ్య ప్రయోజనాలు సాధించవచ్చన్నారు. వీటికి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంటుందన్నారు. ట్రైకోడెర్మా సూడోమోనాస్ వినియోగం ప్రధాన పంటలలో కషాయాల ద్వారా పురుగు మరియు జిగురు అట్టలు, లింగాకర్షణ బుట్టలు దీపపు ఎరలు, పక్షిస్థావరాలు తదితరాలపై అవగాహణ కల్పించారు. పంటల రకాల ఎంపిక, విత్తనం, నారు శుద్ధి, జీవన ఎరువుల వినియోగం తదితరాలపై శాస్త్రవేత్త సాయిమహేశ్వరి వివరించారు. ఉద్యాన విభాగానికి చెందిన శాస్త్రవేత్త మానస ద్యాన పంటపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్‌లు ప్రతాప్, ఏపీసీఎన్‌ఎఫ్ ఇబ్బంది రైతులు పాల్గొన్నారు.



రైతులకు సూచనలు ఇస్తున్న కేవీకే శాస్త్రవేత్త శిల్పకళ

నేడు యోగాంధ్రకు ఏర్పాట్లు సిద్ధం

కమలాపురం : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యోగాంధ్రకు అధికారులు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. ఈనెల 21న అన్ని మండలాల్లో, గ్రామాల్లో యోగాంధ్ర విజయవంతంగా నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించడంతో ఎంపీడీఓ గౌస్‌బాషా ఆధ్వర్యంలో స్థానిక డాక్టర్ బాలయోగి గురుకుల పాఠశాలలో యోగాంధ్ర నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. శుక్రవారం గురుకులం విద్యార్థినులతో డెమో యోగా కూడా నిర్వహించారు. అలాగే యోగాంధ్రను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు, సిబ్బంది, పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, సచివాలయాల సిబ్బంది హాజరు కావాలని ఇప్పటికే ఎంపీడీఓ పిలుపునిచ్చారు. శనివారం నిర్వహించే యోగాంధ్ర కార్యక్రమానికి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు ఎంపీడీఓ తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తామని, పట్టణ, మండల ప్రజలు, విద్యార్థులు, హాజరై యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన తెలిపారు.

యోగా ఎంతో అవసరం

పులివెందుల టౌన్ : నిత్య జీవితంలో యోగా ఎంతో అవసరమని ఆర్డీఓ చిన్నయ్య తెలిపారు. శుక్రవారం పట్టణంలోని స్థానిక వైఎస్సార్ క్రీడా ప్రాంగణంలో యోగాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్డీఓ చిన్నయ్య, యోగా గురువు వెంకట్రామిరెడ్డిలు హాజరై యోగాపై వివరించడంతో పాటు యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాముడు, మున్సిపల్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.



యోగాసనాలు వేస్తున్న విద్యార్థినులు

లయోలా పాలిటెక్నిక్ కళాశాలలో

పట్టణంలోని స్థానిక లయోలా పాలిటెక్నిక్(వైఎస్ఆర్ఆర్)కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు యోగా గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా గురువు ఓం ప్రకాష్ విద్యార్థులకు యోగాసనాలు వేయించి యోగా యొక్క ప్రాముఖ్యతను తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బ్రిట్టో, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు యోగాంధ్రను విజయవంతం చేయండి

లింగాల : స్థానిక బాలయోగి గురుకుల పాఠశాలలో శనివారం నిర్వహించే యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల స్పెషలాఫీసర్ వెంకటేశ్వరరెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డిలు కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు, విద్యార్థులు పాల్గొనాలన్నారు.